నడిమికెళ్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్లలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి హారిక, ఎన్ఎం జి.హేమ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రిజం-10 అమలుపై కేంద్ర బృందం ఆరా

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలో అమలవుతున్న ప్రిజం-10 కార్యక్రమం పనితీరుపై కేంద్ర బృందం ఆరా తీయిస్తుంది. ఇందులో భాగంగా మండలంలోని పనుకువలస, పంచాడవలస తదితర గిరిజన గ్రామాల్లో అమలవుతున్న ప్రిజం-10 కార్యక్రమాన్ని కేంద్ర బృందం సభ్యులు సుదర్శన్ భగత్, సొలోన్ శాన్యాల్ శనివారం పరిశీలించారు. ప్రిజం -10 కార్యక్రమంపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం గర్భిణులతో నేరుగా మాట్లాడారు. రక్తహీనత నివారణకు చేపడుతున్న చర్యలు గురించి ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ బృందం సభ్యులకు వివరించారు. మండలంలో ప్రతి సచివాలయ పరిధిలో ఉద్యోగులతో క్షేత్రస్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి గర్భిణుల్లో రక్తహీనతకు గల కారణాలు అన్వేషిస్తూ నివారణ చర్యలు వైద్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేసి అవసరమైన మందులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. గర్భిణీల్లో రక్తహీనత నివారణతో శిశు మరణాలు తగ్గుతాయని బృందం సభ్యులకు నివేదించారు.

సాలూరులో గిరిజన గర్భిణుల స్త్రీల హాస్టల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటరమణ, ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఎపిఎం జయకుమార్, ాపనుకువలస సర్పంచ్ సిహెచ్ సీతారాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గర్భిణుల స్త్రీల హాస్టల్ పరిశీలన

సాలూరు: పట్టణంలోని గుమడాం వైటిసిలో గల గిరిజన గర్భిణుల హాస్టల్‌ను శనివారం సాయంత్రం కేంద్ర అధికారుల బృందం పరిశీలించింది. కేంద్ర అధికారులు సుదర్శన్ భగత్, సొలోన్ శాన్యాల్ ప్రిజమ్ 10లో భాగంగా పట్టణంలోని గర్భిణుల హాస్టల్‌ను పరిశీలించారు. గిరిజన గర్భిణులకు అందుతున్న వైద్యం, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, డాక్టర్ వెంకటరమణ, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాల్ వున్నారు.

పర్సా ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

శత జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సమరశీల కార్మికోద్యమాన్ని కాపాడడంలోనూ, రాష్ట్రంలో సిఐటియు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన పర్సా సత్యనారాయణ ఆశయాలను కార్మికవర్గం ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. స్థానిక స్థానిక సుందరయ్య భవనంలో పర్సా సత్యనారాయణ శతజయంతోత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ, మధ్యాహ్నం భోజనం పథకం సంఘం జిల్లా కార్యదర్శి వై,శాంతి కుమారి, సిఐటి నాయకులు గవర వెంకటరమణ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మన్మధరావు మాట్లాడుతూ పర్సా జీవిత ఆరంభం ఉద్యమ కెరటాల్లో ఆవిర్భవించిందన్నారు. సింగరేణిలో అగ్నిజ్వాల రగిలించింది, నైజాం రజాకార్లను ఎదిరించి తీవ్ర నిర్బంధానికి గురయ్యారని పేర్కొన్నారు. డెత్ వారెంట్‌తో కాల్చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ ఔరంగాబాద్ జైలుకు తరలించి, చీకటి గదిలో బంధించారన్నారు. జైలు బాత్రూం గోడకు కన్నం పెట్టి తప్పించుకుని, అనేక కష్టాలతో ప్రయాణించి వరంగల్ దళాల్లో తిరిగి చేరారన్నారు. పర్సా జీవితంలో సుమారు 9ఏళ్లకు పైగా జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. 1966లో ఎమ్మెల్యే పదవికి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం సందర్భంగా రాజీనామా చేశారన్నారు. 1970 సిఐటియు ఆవిర్భావం నుంచి 2002 వరకు రాష్ట్ర అధ్యక్షులుగా, అఖిలభారత ఉపాధ్యక్షులుగా పని చేశారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎర్రబావుటా కింద రెపరెపలాడడానికి బీజాలు నాటారని, వర్గ పోరాట సిద్ధాంతాన్ని అమలు చేయడానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. పర్సా జీవితం వ్యక్తిగతంగా అత్యంత నిరాడంబరం, ఎమ్మెల్యేగా పనిచేసిన, ఉన్నత స్థాయిలో ఉన్న, ఒక్క సెంటు భూమి గానీ, చిన్న ఇల్లు గాని సంపాదించుకోలేదని, ఎమ్మెల్యే అలవెన్స్ చనిపోయే వరకు పార్టీకి జమ చేశారని, కార్మిక నేతలు అనుసరించాల్సిన నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం గా నిలిచారని కొనియాడారు. పర్సా జీవితం కార్మిక వర్గం తోనే ప్రారంభమైందని, ఉద్యమ జీవితం కార్మిక రంగంలోనే సాగిందని తెలిపారు. ఉద్యోగిగా ప్రారంభమైన, విప్లవోద్యమం కోసం వృత్తిని వదిలి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో ఓనమాలు దిద్దుకుని, బొగ్గు కార్మికులను సంఘటిత పర్చడంలో కృషిచేసి, సిఐటియు రాష్ట్ర ప్రధాన బాధ్యతల్లో సుదీర్ఘకాలం అధ్యక్షునిగా తన ఉద్యమ ప్రస్థానాన్ని సాగించి, అనేక అటు పోట్ల మధ్య సమరశీల కార్మికోద్యమాన్ని కాపాడడంలోనూ, రాష్ట్రంలో సిఐటియుని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు, కావున ఆయన సేవలను, ఆశయాలను కార్మిక వర్గం మరింత ముందుకు తీసుకుపోవాలని తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

నిబంధనలకు పాతర

- ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాల లేమి
- ఆకర్షణీయ ప్రకటనలతో విద్యార్థులకు గాలం
- అడ్డుగోలుగా అడ్మిషన్లు
- అధికారులకు పట్టని వైనం

ర్యాంకుల సునామి.. అత్యుత్తమ ఫలితాల్లో మాదే అగ్రగామి.. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు మా విద్యార్థులకే సొంతం.. అంటూ అందమైన ప్రకటనలతో విద్యార్థులకు గాలం వేస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలను. జిల్లాలో నిబంధనలకు పాతరేస్తూ ఇష్టారాజ్యంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం గమనార్హం. విద్యా శాఖ నిబంధనలు పట్టని ఆయా విద్యాసంస్థలు అడ్డుగోలుగా అడ్మిషన్లు దండుతున్నాయి. అట్టపెట్టెల్లాంటి గదుల్లో తరగతులు నిర్వహిస్తూ ఫీజులు మాత్రం ఘోరంగా వసూలు చేస్తున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాల్లో సుమారుగా 200 ప్రయివేటు జూనియర్ కళాశాలలున్నాయి. 500 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు లక్షన్నర మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో పలు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. ఎక్కడా సరైన గదులు, ఆట స్థలాలు లేకుండానే విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. పలు విద్యా సంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో ఊదర గొడుతున్నాయి. అత్యధిక మార్కులు తమ సొంతం.. అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ మాయలో పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నాయి. కార్పొరేట్ సంస్థల్లో కాబోయే ఇంజినీర్లు, డాక్టర్లుగా తల్లిదండ్రులు ఊహించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలకు అనుమతులున్నాయో?, లేవో చూసుకోవడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అనుమతులున్న కార్పొరేట్ కళాశాలల మాయమాటలు సైతం నమ్మి మోసపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

అసౌకర్యాల నడుమ

పలు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఫ్యాన్లు, మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత మరీ తీవ్రతరంగా ఉంది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు సిబ్బందికి వేతనాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి కొన్నిటిలో కనిపిస్తోంది. ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సెక్షనుకు 80 మంది విద్యార్థులు, కోటా ప్రకారం సీట్ల కేటాయింపు బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యతమైన బోధనను అందించే ఆధ్యాపకులు లేని విద్యాసంస్థలు జిల్లాలో కోకొల్లలు. వీటిపై పరిశీలన చేసి, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతుల్లేని హాస్టళ్లు

జిల్లాలో దాదాపు అన్ని ప్రయివేటు కళాశాలలు అనుమతులు లేకుండానే హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. డిఇఒ, ఇంటర్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే విద్యాసంస్థల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

జిల్లా కొన్ని విద్యాసంస్థలకు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు బ్రాంచుల పేరుతో ఒకటి రెండు విద్యాసంస్థలకు అనుమతులు తీసుకుని, 4, 5 చోట్ల అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. ఇటువంటి విద్యాసంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాసంస్థలకు గుర్తింపు లేకపోతే విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతులు ఉంటే ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుంది. గుర్తింపు లేని విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రాక, సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యలో చేరేందుకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇలా అనేక సమస్యలు వస్తాయి.

ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు వ్యాపారమే పరమావధిగా నిబంధనలకు నీళ్లొదిలేలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలకు ఉపక్రమించకుండా చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హై లెవెల్ బ్రిడ్జి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుంటాం - తుమ్మగుడ్డి రహదారిలో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. మెట్టగుడ్డి మీదుగా రూ. 5.75 కోట్లుతో రహదారి నిర్మాణం జరుగుతోంది. పనుల నాణ్యత, వివిధ అంశాల్లో జరగాల్సిన పనుల వివరాలను పరిశీలించారు. కొద్ది రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉంటాయని, పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు రహదారి అందుబాటులోకి రావడం వల్ల ఇతర ప్రాంతాలతో అన్ని విధాలా అనుసంధానం జరుగుతుందని చెప్పారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజీ పనుల వివరాలు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం వల్ల అరకుతో సహా దాదాపు 20 గ్రామాలకు అనుసంధానం లభిస్తుందని వివరించారు. ఇదిలా ఉండగా సంవత్సర కాలంలో 52 రహదారులకు అటవీ అనుమతులు జారీ చేసి, మారు మూల ప్రాంతాలలో రహదారి సౌకర్యం కల్పించుటకు జిల్లా కలెక్టర్ చొరవ చూపారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల గ్రామస్తులు అరకుకు కేవలం 30 కిలో మీటర్ల దూరంలో ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బిఇడి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బిఇడి ప్రవేశాలకు నిర్వహించే ఎడ్‌సెట్-2024 ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. 90 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస మోహన్ తెలిపారు. ఎంవిజిఆర్ కళాశాలలో 120 మందికి 103 మంది అభ్యర్థులు, సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 131 మంది, ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో 500 మందికి 454 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు.

సంధ్యారాణికి అభినందనల వెల్లువ

మంత్రి పదవిపై అభిమానుల్లో ఆశాభావం

ప్రజాశక్తి - సాలూరు

ఎమ్మెల్యే సంధ్యారాణికి అభినందనల వెల్లువ కొనసాగుతోంది. గత కొద్దిరోజులుగా ఆమె నివాసానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల తాకిడి పెరుగుతోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వస్తున్న నాయకులు, కార్యకర్తలతో నివాసం సందడిగా కనిపిస్తోంది. శనివారం మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, మండల నాయకులు భాస్కరరావు, మత్స శ్యామ్, యుగంధర్, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు ఆమెను అభినందించారు. పట్టణ సిఐ సిహెచ్.వాసునాయుడు, రూరల్ సిఐ బాలకృష్ణ ఎస్ఐలు ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాచిపెంట, సాలూరు మండలాల యుటిఎఫ్ నాయకులు ఎమ్మెల్యేకు డైరీ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యుటిఎఫ్ నాయకులు ఎ.గణేష్, ఎ.రాజమణి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సంధ్యారాణికి పూలబొకెలు అందజేస్తూ అభినందిస్తున్న మండల టిడిపి నాయకులు

మంత్రి పదవిపై ఆశాభావం

రాష్ట్ర మంత్రివర్గంలో ఎమ్మెల్యే సంధ్యారాణికి చోటు దక్కుతుందని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీ కేటగిరీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో సంధ్యారాణి సీనియర్ ఎమ్మెల్యే కావడంతో మంత్రి పదవి దక్కుతుందని భావిస్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేయడంలో సంధ్యారాణి కృషికి గుర్తింపుగా మంత్రి పదవి ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

సెంచూరియన్ విద్యార్థికి రూ.50 లక్షల ప్యాకేజీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బిటెక్ పూర్తిచేసిన కుసుమంచి చైతన్య రూ.50 లక్షల వేతన ప్యాకేజీకి ఎంపికయ్యాడు. నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్లాంక్ నెట్ వర్క్ సంస్థలో ఆయనకు అవకాశం లభించింది. చైతన్యది సాధారణ కుటుంబం. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.32 లక్షల ప్యాకేజీకి కూడా చైతన్య ఎంపికయ్యాడు. శనివారం చైతన్యను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఘనంగా సత్కరించారు.

వైసిపి ఓటమి టిడిపికి గుణపాఠం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వైసిపి ఓటమి టిడిపికి గుణపాఠం వంటిది. ఔను..! దీన్ని గుణపాఠంగా తీసుకోకపోతే రానున్న ఐదేళ్ల తరువాత పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని చెప్పలేం. తాజా రాజకీయ పరిణామాలే ఇందుకు తార్కాణం. ఈ మాటలు అంటున్నది రాజనీతి శాస్త్రజ్ఞులు, కాకలుతీరిన రాజకీయ నాయకులు మాత్రమే కాదు సుమా..! సాధారణ ప్రజానీకం కూడా చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరువాత జిల్లాలో హాట్‌హాట్‌గా సాగుతున్న పబ్లిక్ టాక్ ఇది. ఇందుకు కారణం లేకపోలేదు. వైసిపికి రాష్ట్రంలో 11 అసెంబ్లీ స్థానాలు, నాలుగు పార్లమెంట్ స్థానాలైనా వచ్చాయి. మన జిల్లాలో ఏంటబ్బా అందులో ఒక్కటి కూడా లేదు. ఇంత ఓటమికి జగన్, ఆయన అనుసరించిన విధానాలే కారణమా? ఇందులో ఎమ్మెల్యేల పాత్ర ఎంత? అనే దానిపై సర్వత్రా చర్చ వినిపిస్తోంది. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతగానో సంతృప్తి పరిచాయి. కానీ, బిజెపి ప్రవేశపెట్టిన చెత్తపన్ను, విలువ ఆధారిత ఆస్తిపన్ను, ఇంటిపన్ను, విద్యుత్తు సంస్కరణల అమలుకు అత్యుత్సాహం చూపడంతో అవి పేద, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారాలుగా మారాయి. దీనికితోడు మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల ప్రవర్తన, భాష జనాన్ని విసిగించాయి. ఇవన్నీ రాష్ట్ర స్థాయిలో జరిగిన లోపాలు. ఈ సంగతి అటుంచితే జిల్లాలోని ఎమ్మెల్యేల తీరు నష్టాలను మరింతగా పెంచింది. మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణను మినహాయిస్తే దాదాపు ఎమ్మెల్యేలంతా గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రయివేటు భూములు కబ్జాలు చేశారని, ఇసుక, కంకర, అటవీ సంపద వంటి సహజ వనరులను సొమ్ము చేసుకున్నారనేది ప్రజలు కోడైకూస్తున్నారు. మరికొందరైతే సంపాదన అనే యావలో పడి ఓట్లేసిన ప్రజలను పట్టించుకోలేదు. చివరికి పార్టీ కార్యకర్తలను సైతం పక్కనబెట్టారు. గడిచిన ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధి మార్గాలను ప్రభుత్వం ఎలాగూ చూపలేకపోయింది. కనీసం ఉన్న ఉద్యోగాలు ఊడిపోకుండా చేయలేకపోయారు.జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడినా నోరు మెదపకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఉద్యోగులకు బదిలీ సిఫార్సులు, అధికారులకు పోస్టింగులు కావాలంటే రూ.లక్షలు

ముట్టజెప్పాల్సిన దుస్థితి కూడా కనిపించింది. ఫైలు స్పీడుగా నడవాలంటే మరో రేటు. ఇక క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గౌరవ వేతనంతో బతుకీడుస్తున్న ఆశా, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్న భోజన కార్యకర్తలపై కూడా రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులకు పాల్పడ్డారు. వీరిలో ఎంతో మందిని బాధ్యతల నుంచి తొలగించి, తమ అనుయాయులను పెట్టుకున్నారు. నిరసన తెలిపితే నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు. వీటి వెనుక కూడా ఎమ్మెల్యే జోక్యం ఉందన్నది జనం మాట. ఇటువంటి చర్యలు కేవలం బాధిత కుటుంబాల్లోనే కాకుండా పేద, మధ్య తరగతి ప్రజలను ఒకింత ఇబ్బందులకు, మనస్తాపానికి గురిచేశాయి. దాదాపు అందరు ఎమ్మెల్యేలూ అధినేత జగన్మోహన్‌రెడ్డి బాధ భరించలేక ఇంటింటికీ వైసిపి ప్రభుత్వం అన్న పేరుతో జనాల వద్దకు వెళ్లినప్పటికీ, స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి వంటివాటికి చొరవ చూపలేదు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాగూ కల్పించలేదు. కనీసం ప్రకటించిన ధర ప్రకారమైనా క్రయవిక్రయాలు జరిగేలా ఎమ్మెల్యేలెవరూ ప్రయత్నం చేయలేదు. మరో మాటలో చెప్పాలంటే ధాన్యం కొనుగోళ్లలో జరిగిన దోపిడీలో సాక్షాత్తూ ఎమ్మెల్యేల హస్తం ఉందన్న ఆరోపణలు కూడా రైతుల నుంచి వినిపించాయి.

జిల్లా ప్రజలకు సాగునీరో తాగునీరో కల్పించేందుకు కనీసం చొరవ తీసుకోలేదు. సాగునీటి కోసం మంత్రి బొత్స కొంత చొరవ చూపినప్పటికీ ప్రభుత్వం సహకరించలేదు. మొత్తం ఇవన్నీ కప్పిపుచ్చేందుకు జిల్లాలోని పార్టీ పెద్దలు లేనిపోని ప్రచారం పదేపదే చేస్తుండేవారు. ఎంతసేపు ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా వచ్చిన నగదు బదిలీ పథకాల ఏకరువే పెట్టారు. దీంతో, ఎమ్మెల్యేలను జనాలు విశ్వసించలేదు. దాదాపు అన్ని చోట్లా ఇదే అంచనాకు వచ్చిన జనం వైసిపి తరపున పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. అందుకే టిడిపి గెలిచింది. ప్రజలంతా మార్పును కోరుకున్నారు. ఈ సత్యాన్ని టిడిపి తరపున గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్‌పిలు ప్రతి క్షణం గుర్తుంచుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇదే ఆదరణ చూపుతారని చెప్పలేం. తాజాగా ఎన్నికైన వారిలో ఎక్కువ మంది కొత్తవారే ఉన్నారు. వీరైనా ప్రజలకు అందుబాటులో, అండగా ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అందుకే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైసిపి ఎమ్మెల్యే, ఎమ్‌పిల ఓటమిని గుణపాఠంగా తీసుకోవాలని జనం చర్చించుకుంటున్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్‌బాబు

నేత్ర వైద్య సేవలపై సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న నేత్ర పరీక్షలు, కళ్ల జోళ్ల పంపిణీ తదితర అంశాలపై జిల్లా ఆసుపత్రి కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. గతంలో జరిగిన కంటి వెలుగు, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జరిగిన పని తీరును పరిశీలించారు. ఇకపై జరపాల్సిన కార్యక్రమాలపై వివరించారు. జిల్లా నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు 26000 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 14109 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు అందించినట్లు, 1890 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా 210 మందికి కళ్ల జోళ్లు అందించాల్సి ఉన్నాయన్నారు. జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య అధికారులు, సహాయకులు అందరూ ప్రజలకు అందుబాటులో వుండి నేత్ర వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పినా మనమందరం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

ధూళికుప్పలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

గిరిజన గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ధూళికుప్ప, కొనగూడ, ఉరిడి గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది మలేరియా స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన రావు ఆదేశాల మేరకు ప్రజలెవరూ మలేరియా వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు నేపథ్యంలో మలేరియా స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కావున ప్రతి ఒక్క ఇంటికీ మలేరియా స్ప్రేయింగ్ చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని విధిగా దోమతెరలు వాడి డ్రైడే ఫ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.సత్యరాజ్, ఎ.నాగేశ్వరరావు, జె.తిరుపతిరావు, కేశవ, ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


రాంబాయిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రాజన్నదొర

రాంబాయికి మాజీమంత్రి పరామర్శ

ప్రజాశక్తి -సాలూరు

పట్టణ వైసిపి మహిళా అధ్యక్షులు ఎస్.రాంబాయి కుమారుడు సాయి వంశీ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో మాజీ మంత్రి పి.రాజన్నదొర శనివారం పరామర్శించారు. రాంబాయి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొద్దిరోజుల క్రితం రాంబాయి కొడుకు సాయి వంశీ హైదరాబాద్‌లో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న రాజన్నదొర బంగారమ్మకాలనీలో ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. సాయివంశీ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ రాపాక మాధవరావు వున్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో లైబ్రేరియన్, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులు బడిబాట పట్టడానికి ఎంతగానో దోహదపడ్డాయని గుమ్మలక్ష్మీపురం లైబ్రేరియన్ డి.సుకన్య అన్నారు. మే 15 నుంచి జూన్ 7 వరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆట, పాటల్లో గెలుపొందిన విద్యార్థులకు సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. ప్రతి విద్యార్థి ఎంతో క్రమశిక్షణతో ఈ వేసవి శిబిరాల్లో పాల్గొని చదువు, క్రీడల పట్ల ఆసక్తి చూపించడం అభినందనీయం అన్నారు.

గిరిజన గ్రామాల్లో సంబరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో గ్రామాల్లో టిడిపి, జనసేన నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు. శనివారం కేదారిపురం గ్రామాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కద్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గిరిజనులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జగదీశ్వరి గెలుపుతో గిరిజన ప్రాంతం అభివృద్ధికి అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు టిడిపి నాయకులు అశోక్, అనిల్, బుజ్జి, వెంకటరావు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

కేదారిపురంలో కేక్‌ను కట్ చేస్తున్న మల్లేశ్వరరావు

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సాగు చేస్తున్న భూమి వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

మండలంలోని కుదుమూరులో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు తక్షణమే పట్టాలి ఇచ్చి ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని, గిరిజనులను బెదిరింపులకు పాల్పడుతున్న విఆర్‌ఒ, ఇతర రెవెన్యూ అధికారులపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో కుదుమూరు భూముల వద్ద శనివారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు సూకూరు అప్పలస్వామి, జమ్ము గోపాలు, కొర్ర కళ్యాణ్ శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏడది పాటు అనేక పోరాటాల ఫలితంగా సర్వేలు చేసినా, నేటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. సర్వే వివరాలను కూడా బయట పెట్టడం లేదని, ఇందులో ఏదో మతలబు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యంగా కలిసి ఉన్న గిరిజనులను విడదీస్తూ ఈ భూములను కాజేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వే చేసిన భూవివరాలను బయటపెట్టి ఎవరైతే సాగులో ఉన్నారో వారందరికీ హక్కులు కల్పించాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు పూర్వం నుంచి సాగు చేస్తున్న సర్వే నెంబరు 48లో ప్రభుత్వ భూముల్లో హక్కులు కల్పించకుండా రెవెన్యూ అధికారులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితి దుర్మార్గమని, ఇప్పటికైనా గ్రామసభల్లో వారు సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని, సర్వే చేసిన వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మండలంలోని ప్రజా సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. నిరసన కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గతంలో టిడిపి హయాంలో నియమితులై వైసిపి ప్రభుత్వ హయాంలో ఉపాధి కోల్పోయిన 'ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని (గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహంలో ఏఎన్‌ఎమ్ లు) తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది లేక అనేకమంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు జిల్లా పర్యటనలో వినతిపత్రం అందజేశామని వారు గుర్తు చేశారు.అలాగే గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలని కోరారు. కొమరాడ గిరిజన బాలుర గురుకుల పాఠశాల ను కళాశాల గా "అప్ గ్రేడ్ చేయాలని, గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురంలో గిరిజన గురుకుల డిగ్రీ, ఐటిఐ, మహిళా డిగ్రీ కళాశాలలు, గరుగుబిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వారు కోరారు.

రామోజీరావు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

భారత దేశ మీడియా రంగంలో అగ్రగణ్యులు, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీ రావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ అదపాక సత్యారావు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మీడియా రంగాన్ని సరికొత్త ధోరణుల్లో ఎంతో ఎత్తుకు తీసుకువెళ్లిన రామోజీరావు మరణం దేశం లోని మీడియా రంగానికి, ప్రత్యేకంగా ఈనాడు గ్రూప్ సంస్థలకు తీరనిలోటని ఒక ప్రకటన లో పేర్కొన్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సత్యా రావు ప్రకటించారు.

పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ సంతాపం

పాలకొండ : ఈనాడు అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సంతాపం తెలిపారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సిఐటియు సంతాపం

ఈనాడు సంస్థల అధిపతి, ప్రముఖ వ్యాపారవేత్త రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలందరికీ సుపరిచితుడైన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు విలేకరులతో మాట్లాడుతూ ఆయన తెలుగు జర్నలిజంలో ఎంతో కృషి చేశారు. తెలుగు సాహిత్యరంగానికి, భాషాభివృద్ధికి తోడ్పడ్డారాన్నరు. వామపక్ష ఉద్యమాలకు తోడ్పడేవారని ఆయన మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు జర్నలిజానికి తీవ్ర లోటని, వారి మృతికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టిడిపి ఆధ్వర్యాన...

ప్రపంచంలోని ఉన్న తెలుగువారంతా గర్వించదగ్గ వ్యక్తి రామోజీరావు అని పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ అన్నారు. రామోజీరావు మృతి కి సంతాపం తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుంకర అనీల్ దత్, హనుమంతు తమ్మరావు, అడపా బాబ్జీ నాయుడు తదితరులు ఉన్నారు.

కురుపాం :ఈనాడు-ఈటీవీ అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పాత్రికేయులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, టిడిపి నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, పలు సంస్థల పాత్రికేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తెలుగు పత్రికా రంగానికి మచ్చు తునకగా ఎనలేని కృషి చేసిన వ్యక్తి రామోజీరావు అని ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటని గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. ఏజెన్సీ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. మీడియా రంగాన్ని సరికొత్త ధోరణిల్లో ఎంతో ఎత్తుకు తీసుకువెళ్లిన ఘనత రామోజీరావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు పైడా కొండలరావు, అధ్యక్షులు సరిపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పాలక ప్రేమానందు, కార్యదర్శి బేత కుమారస్వామి, జర్నలిస్ట్ సభ్యులు కె.రాము, శంకరరావు, కె.వెంకటరావు, శ్రీనివాస్, టి.వినోద్, రాజా, నాని, ఎఎస్ఎం రాజు ప్రకాష్, కిషోర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మరణంతో తెలుగు జాతి పెద్ద దిక్కును కోల్పోయిందని టిడిపి మండల అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు అన్నారు. మండలంలోని మాదలింగిలో రామోజీ చిత్రపటానికి పూనమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో విలువైన రాతలు రాసి సమాజాన్ని మార్పునకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రామోజీరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి తెలియజాతి కీర్తిని మరింత ఉన్నత స్థానంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని ఆయన పేర్కొన్నారు.

రక్త పరీక్షలు తప్పనిసరి : డిఎంఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

క్షేత్ర స్థాయిలో జ్వర నిర్ధారణ పరీక్షలు మెరుగుపర్చాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి క్షేత్ర స్థాయిలో, ఆరోగ్య కేంద్రంలో సేకరించిన జ్వర నిర్ధారణ పరీక్షలు ఏ మేరకు చేపడుతున్నారో నివేదికలు పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో రక్తపూతల సేకరణ (ఏక్టివ్ సర్వలెన్స్) పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిహెచ్‌సికి సీజనల్ జ్వర లక్షణాలతో ఎవరు వచ్చినా వెంటనే మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. పిహెచ్‌సిలో మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా పద్ధతి తప్పని సరి అని తెలిపారు. ఆసుపత్రిలో కుక్క, పాము కాటుల చికిత్స కొరకు అవసరమైన ఎఆర్‌వి, ఎఎన్‌సివి ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచాలన్నారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరగాలా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు దోమల నియంత్రణ చర్యలు, డ్రైడే కార్యక్రమాలు చేపడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్ కుమార్, ఎంఎల సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రక్తపరీక్షల రికార్డులను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

ఇండియా వేదికను బలపర్చాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఇండియా వేదికను ప్రాంతీయ పార్టీలు బలపర్చాలని కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు బోను శంకరరావు కోరారు. మండలంలోని ఎట్టన్న గుడి కూడలి వద్ద మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి వైఎస్ షర్మిల ఎంతో కృషిచేశారన్నారు. రానున్న 2029 ఎన్నికల్లో తప్పనిసరిగా షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. షర్మిలమ్మ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు వెళ్తామని జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామస్థాయిలో చాలామంది కార్యకర్తలు ఒకే సంకల్పంతో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం, ప్రజల హక్కులను కాపాడ్డానికి షర్మిల చేస్తున్న కృషికి మేమంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మరడ వెంకట నాయుడు, ఈపు ధనుంజయ్, బి.అప్పలనాయుడు, కె.గౌరినాయుడు, ఎం.అప్పలనాయుడు, బి.శ్రీరాములు పాల్గొన్నారు

రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

విత్తనాలు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రమైన సీతానగరంలోని మన గ్రోమార్ సెంటర్‌లో గల విత్తనాలను మండల వ్యవసాయ అధికారి అవినాష్ శనివారం పరిశీలించారు. విత్తన నాణ్యతా పరీక్షలు కోసం 400 గ్రాముల విత్తనాలను రీజనల్ పరీక్షా కేంద్రానికి పంపించి 85శాతం శాతం మొలకలు వస్తుందో లేదా అని పంపామన్నారు. అలాగే విత్తనాల ధరలు పట్టిక పెట్టాలని షాపు యజనుమానులకు సూచించారు. విత్తనాలు రికార్డు తప్పనిసరిగా రాయాలని, రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా విత్తనాలు అమ్మితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అలాంటి వారి దగ్గర కొనకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ పరిశీలనలో గ్రోమర్ ఏరియా మేనేజర్, రైతులు పాల్గొన్నారు.

ఏనుగులు ధ్వంసం చేసిన నాటుబండి

ఏనుగుల బెడద తీరెదెప్పుడో?

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుదమ పంచాయతీలో ఏనుగుల గుంపు మళ్లీ హల్ చల్ చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి గౌరీపురంలో అలజడి సృష్టించిన ఏనుగులు చినకుదమ, పెదకుదమ గ్రామాల మధ్య ఇసుక కోసం వెతుకుతున్న నాటు బండిపై దాడికి యత్నించాయి. పెదకుదమ గ్రామానికి చెందిన బోను తిరుపతి శుక్రవారం ఉదయం నాటు బండితో ఇసుక తెచ్చేందుకు వస్తుండగా ఏనుగులు తారసపడ్డాయి. దీంతో భయాందోళన గురైన తిరుపతి తన బండి ఎద్దులను, తాళ్లు విప్పి పరుగులంకించుకుని ప్రాణాలతో బతికి బయటపడ్డారు. అనంతరం ఏనుగులు పొలాల్లోకి వెళ్లి పోయాయి. ప్రస్తుతం ఈ ఏనుగుల గుంపు చినకుదమ గ్రామ సమీపాన మామిడి తోటలో తిష్ట వేశాయి. దీంతో గ్రామంలోని అనేకమంది అరటి, చెరకు రైతులు ఆందోళన గురవుతున్నారు. మరోపక్క ఏనుగుల గుంపుతో ఎలాంటి ప్రాణాన్ని జరగకుండా అటవీశాఖ అధికారులు 8మంది ట్రాకర్స్‌ను అప్రమత్తం చేశారు. రైతులు ప్రజలు ఏనుగులు చూసేందుకు వెళ్లి అల్లరి చేయొద్దని హెచ్చరించారు.

15న పతంజలి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కెఎన్‌వై పతంజలి 72వ జయంతి సందర్భంగా ఈ నెల 15న ప్రముఖ రచయిత రౌతు బంగారునాయుడుకు పతంజలి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ తెలిపారు. శనివారం గురజాడ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని రీడింగ్ హాల్లో అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు, ప్రతినిధులు వి.ఎం.కె.లక్ష్మణరావు, జలంత్రి రామచంద్ర రాజు, గురజాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న రమాదేవి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. ఈ మేరకు ఈనెల 8న స్థానిక సుందరయ్య భవనంలో శనివారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ద్రైవమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రమాదేవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు. చాలీచాలని జీతాలతో బతుకులు నెట్టుకొస్తున్నారన్నారు. ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, వంట షెడ్లు, ప్రభుత్వం సబ్సిడీ గ్యాస్, మెనూ చార్జీల పెంపు, కాటన్ చీరలు, ఉద్యోగ భద్రత లాంటి సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం ఎంతో ఆశగా ఎదురుచూస్తుందని అన్నారు. నిత్యవసర వస్తు ధరలు పెరుగుతున్నాయని, వైద్యం ఖర్చు పెరిగిందని, కావున కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు అనేకమని, వాటన్నిటినీ పరిష్కరించి, తమకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు గవర వెంకటరమణ, భవాని, లక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు

రామోజీరావుకు నివాళ్లు అర్పిస్తున్న పాత్రికేయులు

చురుగ్గా సాగుతున్నకురుపాం మెయిన్‌రోడ్డు పనులు

బిటి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాం ప్రధాన బిటి రహదారి నుంచి మండ గ్రామ ప్రధాన బిటి రహదారి వరకు బిటి రహదారి మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రహదారి పనులను ఆర్ అండ్ బి జెఎ ఎ.సుశీల పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ సిఎంఒ నుండి రూ.3 కోట్ల 80 లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇంతవరకు గుంతలమైన రహదారిపై ప్రయాణానికి ఇబ్బందులు పడేవారమని, ఇప్పుడు మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మృతుడు భరత్ (ఫైల్)

రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మణం చెందిన సంఘటన శనివారం చోటుకు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణం బూరాడ వీధికి చెందిన తెంటు భరత్ (31) మండలంలోని నర్సిపురం సమీపం విశ్వమాంబపురం జనహిత పాఠశాల వద్ద రైలు పట్టాలు దాటుతుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్లే గూడ్స్ రైలు ఢీ కొంది. ఈ సంఘటనలో సంఘటనలో భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా, భరత్ పట్టణంలోని బూరాడ వీధి కి చెందిన వారని గుర్తించారు. రైల్వే హెచ్‌సి రత్న కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి బావిలో దిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మక్కువ

మృతి చెందిన నాగేశ్వరరావు

మండలం లోని ఎస్.పెద్ద వలసకు చెందిన వడ్డే నాగేశ్వరరావు (53) స్నానానికి బావిలోకి దిగి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం నాగేశ్వరరావు శుక్రవారం ఇంటి వద్ద నుండి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులకు అనుమానం వచ్చి చుట్టుపక్కల వెతాకారు. ఈ సందర్భంగా పాత కామిడివలస వద్ద నేలబావిలో మృతదేహం తేలియాడడం కనిపించడంతో గట్టుపై ఉన్న బట్టల ఆధారంగా నాగేశ్వరావు మృతదేహంగా గుర్తించారు. దీంతో అతని కుమారుడు చంటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నాగేశ్వరరావు మద్యం మత్తులో ఉండడంతో ఈ ఘటన చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.